తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం   సూర్యపేట
యాదాద్రి భువనగిరి
శనివారం
01 ఆగష్టు 2026
పేజీలు : 8

## రైతు రాజ్యం అంటే ఇదేనా?: రెండు దశాబ్దాలుగా

# తిప్పారెడ్డిగూడెం రైతుల పొలాల బాటల కష్టాలు!

- పొలాలకు వెళ్లాలంటే కాలినడకే దిక్కు.. పంట ఇంటికి చేరాలంటే భుజాలే ఆధారం!
- రహదారి లేక పెరుగుతున్న సాగు ఖర్చులు.. అదనపు శ్రమతో కుంగిపోతున్న అన్నదాత
- వర్షాకాలంలో నరకప్రాయంగా మారుతున్న ప్రయాణం.. స్పందించని పాలకులు, అధికారులు



**తిరుమలాయపాలెం జూలై 31 (జనంసాక్షి )** దేశానికి వెన్నెముక రైతు అని పదే పదే చెప్పే మాటలు.. తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం గ్రామ పరిధిలోని రైతుల విషయానికి వస్తే కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) ఇక్కడి రైతుల ప్రధాన సమస్య పరిష్కారానికి నోచుకోక, ప్రతి పంట సీజన్‌లోనూ అన్నదాతలు నరకయాతన అనుభవిస్తున్నారు. తమ వ్యవసాయ భూములకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో, సాగు చేయడం కన్నా పొలాలకు వెళ్లడమే ఒక పెద్ద యుద్ధంలా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సాగుకు రాని యంత్రాలు.. భుజాలపైనే పంటల మోత!**

నేటి ఆధునిక కాలంలో వ్యవసాయం అంతా యంత్రాలపైనే సాగుతుంటే, ఇక్కడి రైతులకు మాత్రం కాలినడకే దిక్కవుతోంది. పొలాలకు సరైన దారి లేకపోవడంతో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు లోపలికి రాలేని దుస్థితి నెలకొంది. పంట సాగు పనుల కోసం విత్తనాలు, ఎరువుల బస్తాలను మైళ్ల దూరం నడుచుకుంటూ మోసుకెళ్లాల్సి వస్తోంది. మరీ ముఖ్యంగా పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం బస్తాలను, పండించిన మిర్చి లేదా ఇతర పంటలను అమ్ముకోవడానికి రోడ్డు వరకు తేవాలంటే భుజాలపై మోయడమో, లేదా అదనపు కూలీలను పెట్టుకోవడమో తప్పడం లేదు. దీనివల్ల రైతులపై శారీరక శ్రమతో పాటు పెట్టుబడి ఖర్చులు భారంగా మారుతున్నాయి.

**బురదమయంగా 'బాటలు'.. అత్యవసర పరిస్థితుల్లో ఆర్తనాదాలు!**

వర్షాకాలం వస్తే ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా, **మిగతా 8లో**



### వీరాపురం ఇసుక ర్యాంపును

# ముంచెత్తిన గోదావరి వరద

- 46 మందిని సురక్షితంగా రక్షించిన అధికారులు..
- సీఐ రాజువర్మకు తృటిలో తప్పిన ప్రమాదం..

**చర్ల/భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం వీరాపురం ఇసుక ర్యాంపును గోదావరి వరద పూర్తిగా చుట్టుముట్టింది. వరద నీరు ఒక్కసారిగా పెరగడంతో ర్యాంపులో పనిచేస్తున్న సిబ్బందితో పాటు పలువురు లారీ డ్రైవర్లు, ఇసుక లారీలూ వరదలో చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు, చర్ల సీఐ రాజువర్మ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారుల సమన్వయంతో చేపట్టిన సహాయక చర్యల్లో ర్యాంపు సిబ్బంది, లారీ డ్రైవర్లు కలిపి మొత్తం 46 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు. అయితే సహాయక చర్యల సమయంలో చర్ల సీఐ రాజువర్మకు తృటిలో ప్రమాదం తప్పింది. వరదలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తెప్పపై గోదావరి పాయను దాటుతుండగా వరద ఉధృతి కారణంగా తెప్ప అదుపు తప్పి నీటిలో తిరగబడింది. దీంతో తెప్ప కొంతదూరం వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. అయినప్పటికీ సీఐ రాజువర్మ చాకచక్యంగా తెప్పను పట్టుకుని తనను తాను కాపాడుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరిలో వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే తప్ప వరద నీటిలోకి వెళ్లవద్దని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం ?

- ప్రధాన రహదారులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్
- సారపాక-రెడ్డిపాలెం మార్గంపై ముందస్తు చర్యలకు ఆదేశాలు..
- తూరుబాక-దుమ్ముగూడెం రహదారిపై రాకపోకలు నిలిపివేత



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 1 (జనం సాక్షి):** గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం సాయంత్రం సారపాక?రెడ్డిపాలెం, తూరుబాక-దుమ్ముగూడెం ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. సారపాక-రెడ్డిపాలెం ప్రధాన రహదారిని పరిశీలించిన కలెక్టర్, గోదావరి నీటిమట్టం మరింత పెరిగితే వరద నీరు రహదారిపైకి చేరి రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారుల నుంచి **మిగతా 7లో**

## ముద్ర రుణాలతో చేనేత కళాకారులు ఆర్థికంగా ఎదగాలి

### కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్గొండ, జూలై 31,(జనంసాక్షి):** జిల్లాలోని చేనేత కళాకారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిని విస్తరించడంతో పాటు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చేనేత కళాకారులకు ముద్ర రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్గొండ జిల్లాకు చేనేత రంగం ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చే రంగమని పేర్కొన్న కలెక్టర్, చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు ముద్ర రుణాలను వినియోగించుకుని తమ వృత్తిని విస్తరించి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.ముద్ర పథకం కింద రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, వ్యక్తిగతంగా, సంఘాలుగా లేదా క్లస్టర్ల రూపంలో కూడా ఈ రుణాలను పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాలు లభిస్తాయని, చేనేత కళాకారులకు అధికారులు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు.చేనేత భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి చేనేత కళాకారుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు ఏర్పడిన నేపథ్యంలో ఇకపై తరచూ చేనేత కళాకారులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే చర్యలు చేపడతామని తెలిపారు.ఆగస్టు 7న నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని చేనేత కళాకారుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా చండూరు మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను **మిగతా 2లో**

## బిఎల్ఓలను సన్మానించిన నాయకులు




**సూర్యాపేట (జనంసాక్షి):** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరును కలిసి తమ వివరాలను సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అందజేసేందుకు విశేష కృషి చేసిన బిఎల్ఓలను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూచనలతో సర్ ప్రోగ్రాం పార్టీ ఇన్చార్జ్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా ఉపాధ్యక్షులు కుంట్ల వెంకట నాగిరెడ్డి శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా సన్మానించారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్ఐఆర్ కాంగ్రెస్ మండల ఇంచార్జ్ దండి రమేష్ ఆధ్వర్యంలో సోలిపేట, రామచంద్రాపురం, రత్నపురం, రామారం, దుబ్బ తండా, సపవత్ తండా, రాజు నాయక్ తండా, టేకుమట్ల గ్రామాలలో సర్ ప్రోగ్రాంలో నూటికి నూరు శాతం ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తిచేసిన ప్రతి మహిళా బిఎల్ఓలకు చీర పెట్టి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని బూత్ లలో సర్ ప్రక్రియను నూరు శాతం పారదర్శకంగా, సమర్థవంతమైన సమాచారంతో నిర్వహించేందుకు పార్టీ బిఎల్ఎలను, నాయకులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తూ సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తాము అడిగిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు, నాయకుల సహకారం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు తాటిపాముల సుధీర్,గట్టు జ్యోతి శ్రీనివాస్, ఉయ్యాల ఆదినారాయణ, దాసరి శ్రీనివాస్, చింత కేశవులు, నక్క లింగయ్య, బిఎల్ఓలు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌లో పౌర హక్కుల దినోత్సవం



**హుజూర్‌నగర్, జూలై 31 (జనంసాక్షి):** పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా శుక్రవారం హుజూర్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో 1వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురపాలక సంఘ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై ఎవరైనా వివక్ష చూపినా, సమానత్వం పాటించకపోయినా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దద్దనాల చెరువు 1వ వార్డులోని పలు సమస్యలను ప్రజల నుండి తెలుసుకున్న ఛైర్మన్, వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్, కమిషనర్ కె. సతీష్ కుమార్, 1వ వార్డు కౌన్సిలర్ మోదల కామేశ్వరి సైదులు, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ అధికారులు, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, హెల్త్ శాఖల అధికారులు, పురపాలక సంఘ విభాగాధిపతులు, కార్యాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా వెంపటి శబరినాథ్

**సూర్యాపేట (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా వెంపటి శబరినాథ్ నియమితులయ్యారు.రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు.సూర్యాపేటకు చెందిన వెంపటి శబరినాథ్ 2018 సంవత్సరం నుండి వాసవి క్లబ్ లలో వివిధ హోదాల్లో సేవలందించారు.ఇటీవల జరిగిన ఆర్యవైశ్య మహాసభ పట్టణ ఎన్నికల్లో, ఆర్యవైశ్య మహాసభ సంఘ సభ్యత్వాల నమోదుతో పాటు ఆయన చేస్తున్న సేవలకు గాను రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో స్థానం సంపాదించడం పట్ల పలువురు ఆర్యవైశ్యులు వెంపటి శబరినాథ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## "రక్తదానం - మరొకరికి ప్రాణదానం"

**డిఎస్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ దగ్గుపాటి బాబురావు**



**హుజూర్‌నగర్, జూలై 31,(జనంసాక్షి) :** ఆపద సమయంలో రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణం నిలబడుతుందని "రక్తదానం – మరొకరికి ప్రాణదానం" అని డి ఎస్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ దగ్గుపాటి బాబురావు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన మహిళకు ౹ా పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా డి.ఎస్.ఆర్ ట్రస్ట్ ను కోరగా వెంటనే సమాచారం అందుకున్న డి ఎస్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ దగ్గుపాటి బాబురావు స్పందించి రక్తదాతలను సంప్రదించగా ట్రస్ట్ సభ్యుడు రాంశెట్టి ఉపేందర్ నాయుడు తక్షణమే ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇలా ఉపేందర్ 29వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి బాబురావు మాట్లాడుతూ "రక్తం అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ డి ఎస్ ఆర్ ట్రస్ట్ అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి మానవత్వం చాటాలని కోరారు. రక్తదానం చేసిన ఉపేందర్‌కు ట్రస్ట్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు" తెలిపారు.

## రాఘవాపురం లో సీసీటీఎన్ఎస్ పై అవగాహన




**బీబీనగర్(జనంసాక్షి):** బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీసీటీఎన్ఎస్ ( క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం) పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీనగర్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ గ్రామస్తులకు సైబర్ నేరాల నివారణ, పోలీసు సేవల వినియోగం, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల నమోదు విధానం, మహిళల భద్రత, చట్టాలపై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు శాఖను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్, ఉపసర్పంచ్ శ్రీమతి సిలువేరు కవిత, వార్డ్ సభ్యులు తోరుపునూరి రవి, బుయ్యి పాండు, బండారి అశ్విని, పొట్ట మంగమ్మ, సెక్రటరీ కవిత, మేకల కుమారస్వామి,గుంటిమిది రవి, కోర్ని పాండు, కోండిరెడ్డి కుమార్, అనుకోజు రాజు,వంగరి మల్లేష్,గ్రామ పంచాయతీ సిబ్బంది, , టీచర్స్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ముద్ర రుణాలతో చేనేత కళాకారులు ఆర్థికంగా ఎదగాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి చేనేత కళాకారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, చేనేత శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్, చండూరు మాజీ జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, చేనేత కళాకారులు, అధికారులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి:విద్యార్థుల నిరసన




**చింతపల్లి, జూలై 31(జనంసాక్షి)** బీసీ జాతీయ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి మండలంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (గవర్నమెంట్ జూనియర్ కాలేజ్) ఇంటర్ విద్యార్థులు శుక్రవారం తరగతులను బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు ఏనుగుల వెంకటేష్, చీమల వెంకటేష్, కుందేళ్ల శ్రీశైలం, సీత శివకుమార్ యాదవ్,గంట జగదీష్ యాదవ్ మాట్లాడుతూ, పేద మరియు బీసీ విద్యార్థుల ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి ఆర్టీఐ ప్రచార సమితి చింతపల్లి మండల అధ్యక్షుడు చెట్టిమల్ల సురేష్‌రావు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వి బి జి రామ్ జి ఉద్యోగుల పెన్‌డౌన్ ఉ షట్‌డౌన్ నిరసన



**నేరేడుచర్ల జూలై 30 (జనంసాక్షి):** విబిజి రామ్ జి ఉద్యోగుల వేతన శ్రేణి (పే స్కేల్) మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నేరేడుచర్ల వి బి జి రామ్ జి ఉద్యోగులు పెన్‌డౌన్, షట్‌డౌన్ నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు,వి బి జి రామ్ జి ఉద్యోగులు మాట్లాడుతూ. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ,తమకు తగిన వేతన శ్రేణి లేకపోవడం వలన ఉద్యోగులు ఆర్థికంగా,సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించే వరకు శాంతియుతంగా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అనంతరం ఎంపీడీవో సోమసుందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ,వి బి జి రాజీ ఉద్యోగులు ఏపీ ఓ శేఖర్, ఈసీ మహేష్ టెక్నికల్ అసిస్టెంట్ సతీష్ రెడ్డి ,వేణుగోపాల్,రాంబాబు, సిఓఎస్ నగేష్ ,అశ్విని,పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో ఓరియంటేషన్, శిక్షణ కార్యక్రమానికి కౌన్సిలర్లు

**నేరేడుచర్ల జూలై 31 (జనంసాక్షి):** హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగే ఒకరోజు ఓరియంటేషన్ , శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ ఛైర్మన్ కొణతం వెంకట్ రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులుగా నిర్వహించాల్సిన పాత్ర, బాధ్యతలు,ప్రజా సమస్యల పరిష్కారం,పట్టణ పాలనలో వారి భాగస్వామ్యం,ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అనుసరించాల్సిన విధానాలు తదితర అంశాలపై నిపుణులు సమగ్రంగా అవగాహన కల్పించటం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు.



# ఆగస్టు 11 జైల్ భరో విజయవంతం చేయాలి

## సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సీ వై పుల్లయ్య

**ఖమ్మం రూరల్,జూలై 31(జనంసాక్షి):** రైతాంగ సమస్యల పరిష్కారం, పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర, వ్యవసాయ రంగంలో కార్పొరేట్ జోక్యాన్ని అరికట్టడం తదితర డిమాండ్ల సాధన కోసం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో ఆగస్టు 11న ఖమ్మంలో నిర్వహించే జైలు భరో కార్యక్రమాన్ని రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య పిలుపునిచ్చారు.

శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం ఎం. వి. పాలెం లో పాలేరు డివిజన్ కమిటీ సమావేశం రెంటాల యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం రోజురోజుకూ తీవ్రతరమవుతోందని, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఎన్నికల హామీ మేరకు వృద్ధాప్య, వితంతు తదితర సామాజిక భద్రతా పెన్షన్లను తక్షణమే పెంచాలని, వ్యవసాయ కూలీలు, ఆటో కార్మికులకు ప్రకటించిన పెన్షన్లను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమాల్లో పాల్గొన్న రైతులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, అరెస్టులను నిలిపివేయాలని అన్నారు.



రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ.. గోదావరి జలాలను పాలేరు వరకు మళ్లించే చర్యలు చేపట్టాలని, వర్షాభావంతో పంటలు కోల్పోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఆర్.శివలింగం, కమ్మకోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, బందెల వెంకయ్య, కుర్ర వెంకన్న, సోమనపల్లి వెంకటేశ్వర్లు,ఎడ్లపల్లి ఉపేందర్, వీర్ల వెంకట అప్పారావు,శీలం పూలమ్మ, శంకర్, ఆరెంపుల వెంకన్న, చిర్రా బిక్షం తదితరులు పాల్గొన్నారు.



# వి బి జి ఆర్ ఏ ఎం జి ఉద్యోగుల సమస్యలపై నిరసన

**టేకులపల్లి, జులై 31(జనంసాక్షి):** టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వి బి జి ఆర్ ఏ జి ఉద్యోగులు తమ సమస్యలపై శుక్రవారం శాంతియుత నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం టేకులపల్లిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని, ఉద్యోగుల బదిలీలను చేపట్టాలని, మితిమీరిన పని వత్తిడిని తగ్గించాలి.

ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో అదనపు కార్యక్రమ అధికారి శ్రీ కాళంగి శ్రీనివాస్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీ ఎం. తిరుపతి, టీఏలు బీముడు, వెంకట రమణ, సురేష్, చాంద్ మాల్, స్వప్న, ఈశ్వరి, కంప్యూటర్ ఆపరేటర్లు సురేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల పాఠశాల వాచ్మెన్ పదవీ విరమణ సత్కారం

**ఎర్రుపాలెం, జులై 31 (జనంసాక్షి):** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో శుక్రవారం రోజున వాచ్‌మెన్ పదవి విరమణ సభ, 5వ తరగతి–ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు విజయవంతంగా జరిగాయి.పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వాచ్‌మెన్ పదవి విరమణ సన్మాన సభతో పాటు 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరితంగా, అట్టహాసంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యుటీఎఫ్ నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి వి.పరమేశ్వరి గారు మాట్లాడుతు, పారిశాల అభివృద్ధికి ఎన్నో సంవత్సరాలుగా నిబద్ధతతో సేవలందించిన వాచ్‌మెన్ శ్రీ లంక నాగమణి గారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలనతో ఆమె చేసిన సేవలు ప్రతి ఉద్యోగికి ఆదర్శమని పేర్కొన్నారు.అనంతరం ఆమెను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.అదే వేడుకను 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించి పారిశాల కుటుంబంలోకి సాదరంగా ఆహ్వానించారు. విద్యార్థులకు పుష్పాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకొని విద్యాసంస్థకు మంచి పేరు తీసుకు రావాలని వక్తలు సూచించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, గేయాలు, వినోదాత్మక ప్రదర్శనలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పదవి విరమణ పొందిన ఉద్యోగికి తన సేవా కాలపు అనుభవాలను పంచుకుంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ యరమల స్వాతి,ఉపాధ్యాయునులు జాన్సీ, ధనలక్ష్మి, శిరీష, నాగ సత్యవతి, అరుణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - సబ్ కలెక్టర్ మృనాల శ్రేష్ట

**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)**

గోదావరి పరివాహక ప్రాంతంలోని గోదావరి ముంపునకు గురి అయ్యే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. శుక్రవారం సాయంత్రం భద్రాచలంలో కరకట్ట వద్ద వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి ముంపు ప్రాంతాలకు సంబంధించిన గ్రామాల వివరాలను సంబంధిత తహసీల్దారును అడిగి తెలుసుకున్న అనంతరం ముంపు ప్రాంతాల ప్రజలకు కొన్ని సూచనలు అందించారు. గోదావరి ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు గోదావరి వరదల సమయంలో చేపలు పట్టడం స్నానాలు చేయడం ఈత కొట్టడం ఫోటోలు తీయడం లేదా ఇతర ఏ ప్రయోజనం కోసం అయినా నదీ తీరాలు రేవులు వాగులు, చెరువులు కుంటలు మరియు లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. వరదల సమయంలో అనవసర ప్రయాణాలు మానుకోవాలని ప్రజలు వీలైనంత వరకు ఇళ్లల్లోనే ఉండాలని అత్యవసరం కాని ప్రయాణాలు చేయవద్దని అన్నారు. ముఖ్యంగా ముంపు ప్రాంతాల ప్రజలు స్థానిక అధికారులు తాసిల్దార్లు ఎంపీడీవోలు మరియు పంచాయతీ కార్యదర్శులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించి వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. స్థానిక అధికారులు అసూరక్షితం అనే ప్రకటించిన లేదా బ్యారికెట్లు ఏర్పాటు చేసిన ప్రాంతం రహదారి వంతెన లేదా క్యాజువల్స్ ఉపయోగించడం గాని సందర్శించే సాహసాలు చేయకూడదని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో లేదా వరద సంబంధిత సమాచారం కోసం వరద నియంత్రణ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08743- 232444 ఫోన్ ద్వారా తెలియజేయాలని అన్నారు.

# ప్రాథమిక పాఠశాలకుప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ వితరణ

**కల్లూరు జూలై 31(జనం సాక్షి)**



కల్లూరు పట్టణ పరిధి శాంతినగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు టిడిపి జిల్లా నాయకుడు జాస్తి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీటి సౌకర్యార్థం ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ను మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ ,ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, చేతులు మీదగా వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమం లో రైటర్డ్ ఎంఈఓ కాకర్ల రంగారావు, తెలుగుదేశం జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, ప్రజాసంఘాల నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్, బైర్ల కాంతారవు, ఖమ్మంపాటి వీరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయాలు రత్న మాధురి, ఉపాధ్యాయలు గుర్రాల సుదీర్ తదితరులు పాల్గొని వితరణ చేసిన శ్రీనివాసరావు ను అభినందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# కలుషితం అవుతున్న మిషన్ భగీరథ త్రాగునీరు

**మధిర, జూలై 31 (జనంసాక్షి):** గ్రామాలకు త్రాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథకు సంబంధించిన పైపులైను లీకవుతున్న కూడా సంబంధిత అధికారులు స్పందించట్లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మధిర మండల పరిధిలోని దేశినేని పాలానికి త్రాగునీరును అందిస్తున్న మిషన్ భగీరథ కు సంబంధించిన పైప్ లైన్ గత కొన్ని నెలలుగా రాయపట్నం గ్రామం వద్ద లీక్ అవి అక్కడ నుండి నీరు కలుషితం అవుతుంటే అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా పట్టించుకోవడంలేదని దేశినేనిపాలెం గ్రామ వాసులు వాపోతున్నారు. తాగునీరు కలుషితం అవడంతో పలు వ్యాధుల బారిన పడుతున్నట్లు ఆ గ్రామవాసులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లీకేజ్ కు మరమ్మతులు నిర్వహించే స్వచ్ఛమైన త్రాగునీరు అందించవలసిందిగా దేశినేని పాలెం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి: సిపిఎం



**చంద్రుగొండ, జూలై 31 (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తలమానికమైన సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం దాసరి సీతారాములు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ప్రాజెక్టు పూర్తిలో జిల్లాకు చెందిన మంత్రులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. ముందుగా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని అన్నారు. కాలువలు తవ్వక, చెరువులు నింపక రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు అన్యాయం జరిగితే రైతులతో కలిసి సిపిఎం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మండల కార్యదర్శి పెద్దిన్ని వేణు, రామడుగు వెంకటాచారి, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, చల్లపల్లి రాజా, కాకా సీత, గోగుల తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాత పాల్వంచలో దొంగల హల్ చల్





**కొత్తగూడెం క్రైమ్, జూలై31 (జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని పాత పాల్వంచలో గురువారం రాత్రి దొంగలు హల్చల్ సృష్టించారు. పాత పాల్వంచ ప్రధాన రహదారిలో గల ఒక ఇంట్లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగలించి సాయినగర్ లో వదిలివేసి, ద్విచక్ర వాహనాన్ని పాక్షికంగా తీసుకుని ధ్వంసం చేశారు. అదే రోజు రాత్రి గడియకట్ట లోని శంకర్ రెడ్డి ఇంట్లో దొంగతనం చేసి సుమారు 5 తులాల బంగారాన్ని అపహరించారు. ఇంటి యజమానులు వెనక రూములో నిద్రిస్తున్న సమయంలో ముందు రూము తలుపులు పగలగొట్టి బీరువా తెరచి వస్తువులను చిందరవందరగా పడవేసి 5 తులాల బంగారాన్ని అపహరించారు. సుమారు 15 రోజుల క్రితం పాత పాల్వంచ నుంచి బంగారుజాలు వెళ్లే మార్గంలో వరి పొలంలోని విద్యుత్ మోటార్ను చోరీ చేశారు. దీంతో పాత పాల్వంచ ప్రజలు భయాందోళన గురవుతున్నారు. పోలీసులు నైట్ పెట్రోలింగ్ పెంచి నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

## ఖమ్మంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన బచ్చు విజయ్ కుమార్

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 31 (జనంసాక్షి):** నగరంలోని ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం నగర కార్పొరేషన్ 2వ డివిజన్లో బీఆర్ఎస్ నాయకుడు షేక్ మదర్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వాటర్ ప్లాంట్'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్లాంట్లోని మోటార్లను ఆన్ చేసి తాగునీటి సరఫరాను మొదలుపెట్టారు. ప్లాంట్ పనితీరును పరిశీలించిన విజయ్ కుమార్.. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ శుద్ధి చేసిన నీటిని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు షేక్ మదర్ను శాలువాతో ఘనంగా సత్కరించి, నూతన వ్యాపారంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి, నాయకులు అయ్యప్ప రెడ్డి, చిలుమూరు కోటి, సద్దాం షేక్, మాటేటి కిరణ్, ఎండీ ఫయజ్, హెచ్. ప్రసాద్, హెచ్. వెంకటేశ్వర్లు, ఖాజా రెడ్డి, మెడబోయిన పెద్ద మల్లేశం, కాట్రాల దినేష్, ఉపేందర్, రాజు, ఉపేంద్ర చారి, నాగేంద్రబాబు, వంగర కొండల్, గాజుల అనిల్, తోట సుధాకర్, గెలవయ్య, తంగిల్లపల్లి శ్రీనివాస్, తీగల సతీష్ గౌడ్, మిర్యాల రమేష్, కొల్లేరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## హంగామా కాదు.. హృదయపూర్వక సేవ

- మనవరాలి పుట్టినరోజు వేడుకల్లో మానవత్వం చాటిన వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు కుటుంబం
- అనాథల ఆశ్రమంలో అన్నదానం..
- నేలపై కూర్చొని ఆశ్రమవాసులతో కలిసి విందు స్వీకరణ



**ఖమ్మం రూరల్, (జనంసాక్షి) :** నేటి కాలంలో పుట్టినరోజు వేడుకలంటే భారీ సెట్టింగ్‌లు, లక్షల రూపాయల వృథా ఖర్చులు, మైకుల హోరు మధ్య హంగామా చేయడం సర్వసాధారణమైంది. కానీ, వీటన్నింటికీ భిన్నంగా సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ఓ ప్రజాప్రతినిధి కుటుంబం ఆదర్శప్రాయంగా ముందడుగు వేసింది. ఖమ్మం రూరల్ మండలం వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు చిన్న కుమారుడు ఆవుల వినోద్ - సంధ్య దంపతుల ఏకైక కుమార్తె హస్మిత పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు తావులేకుండా, అనాథల ఆకలి తీర్చే సేవా వేడుకగా నిర్వహించారు.

**ఆశ్రమ వాసుల్లో ఆనంద కాంతులు**

ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని పెద్ద తండా సమీపంలో ఉన్న 'మేఫీ మానసిక వికలాంగుల కేంద్రం ఉ అనాథల ఆశ్రమాన్ని' సర్పంచ్ కుటుంబ సభ్యులు సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారు మరియు మతిభ్రమించి నిరాశ్రయులైన బాధితులకు ప్రత్యేకంగా రుచికరమైన భోజన విందు ఏర్పాటు చేశారు.

**హోదాను పక్కనబెట్టి.. నేలపై కూర్చొని..**

అధికార హోదాను, అంతస్తులను పక్కనబెట్టి సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు స్వయంగా ఆశ్రమవాసులకు ప్రేమతో భోజనం వడ్డించారు. అంతటితో ఆగకుండా, ఆశ్రమవాసులతో పాటు స్వయంగా నేలపై కూర్చొని వారితో కలిసి భోజనం చేయడం అక్కడున్న వారి హృదయాలను తడిమేసింది. సర్పంచ్ నిరాడంబరత, ఆప్యాయతను చూసి ఆశ్రమ నిర్వాహకులు, స్థానికులు తీవ్రంగా భావోద్వేగానికి లోనయ్యారు.

**స్ఫూర్తిదాయకం.. అభినందనీయం**

నిజమైన వేడుక అంటే నిరాశ్రయుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమేనని నిరూపించిన సర్పంచ్ కుటుంబాన్ని ఆశ్రమ నిర్వాహకులు కొనియాడారు.

## గోదావరి ఉద్ధృతి

**- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- వరద ప్రవాహాలు, చెరువుల వద్దకు వెళ్లొద్దు: ఎస్ఐ మేడ ప్రసాద్ హెచ్చరిక**



**బూర్గంపహాడ్ జూలై 31 (జనంసాక్షి)** భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉద్ధృతి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో బూర్గంపహాడ్ మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు. గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో ఎవరూ వరద ప్రవాహాలు, వాగులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. వరద నీటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అవసరమైతే ఆలస్యం చేయకుండా ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అధికారులు, రెవెన్యూ, పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 100 నంబర్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపారు. వరదల సమయంలో ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.



## ట్రస్ట్ సేవలు అభినందనీయం -ఎస్ఐ వెంకటేష్

**పేద వికలాంగులకు అండగా జోనెబోయిన ట్రస్ట్**

**పెనుబల్లి,జులై 31(జనంసాక్షి)** పేద వికలాంగులకు వీల్ చైర్లు.ట్రై సైకిళ్లు అందిస్తూ అండగా నిలుస్తున్నజోనెబోయినచారిటబుల్ ట్రస్ట్. ఈ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వి ఎం బంజర్ ఎస్ ఐ కె వెంకటేష్ అన్నారు.ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రంగారావు బంజర గ్రామానికి చెందిన నడవలేని స్థితిలో ఉన్న ముగ్గురు నిరుపేద వికలాంగుల కు ట్రస్ట్ నిర్వాహకురాలు మండాలపాడు గ్రామానికి చెందిన జోనేబోయిన అన్నపూర్ణ 20 వేల రూపాయలు విలువగల మూడు వీల్ చైర్ లను వితరణగా అందించారు. శుక్రవారం ఎస్ ఐ గ్రామంలో వున్న వికలాంగులకు అందచేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ అన్నపూర్ణ ఒక వికలాంగురాలు అయ్యి వుండి కూడా తనకు వున్నదానిలో నిరుపేద వికలాంగులు అని తెలిస్తే సాయం చేయడానికి ముందుంటారని ఆమె సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యడ్ల బంజర్ సర్పంచ్ రాజిన్ని రాంబాబు, అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ, నాని తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీక పెద్ది సుదర్శన్ రెడ్డి.. ఉద్యమకారుల ఘన నివాళి



**చంద్రుగొండ, జూలై 31 (జనం సాక్షి):** తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి సంతాపంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం జేఏసీ చంద్రుగొండ ఆధ్వర్యంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ముందుగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం "పెద్ది సుదర్శన్ రెడ్డి అమర్ హై", "జై తెలంగాణ" అంటూ నినాదాలు చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన త్యాగాలు, ఉద్యమ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధి కోసం ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు.ఈ సంతాప సభలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం జేఏసీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మరణం తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## జలసిరి' పనుల్లో వేగం పెంచాలి

**క్షేత్రస్థాయిలో డిపిఓ జి. వినోద్ కుమార్ సుడిగాలి పర్యటన!**

**తిరుమలాయపాలెం జూలై 31 (జనంసాక్షి )**
అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మరియు ప్రజలు త్రికరణ శుద్ధిగా చేతులు కలిపినప్పుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి (ఆఖూ), తిరుమలాయపాలెం మండల ప్రత్యేక అధికారి జి. వినోద్ కుమార్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని పిండిప్రోలు, బీరోలు, ఏలు వారి గూడెం గ్రామాలలో శనివారం ఆయన మెరుపు పర్యటన చేశారు. 'జలసిరి' ప్రోగ్రాంలో భాగంగా సాగుతున్న జల సంరక్షణ పనులను క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా పరిశీలించారు.

**సమన్వయంతోనే పల్లె ప్రగతి: నాణ్యత ముఖ్యం**
ఈ సందర్భంగా డిపిఓ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు జలసిరి పనులు ఎంతో కీలకమన్నారు. ఈ బృహత్తర కార్యం విజయవంతం కావాలంటే కేవలం అధికారుల ఆదేశాలే సరిపోవని, క్షేత్రస్థాయి ఉద్యోగుల పర్యవేక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పిండిప్రోలు, బీరోలు, ఏలువారి గూడెం గ్రామాల్లో పనుల ప్రగతిని సమీక్షిస్తూ.. ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు!**
ప్రభుత్వ ఆశయాలకు గండికొడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు ఉంటాయని డిపిఓ హెచ్చరించారు. అధికారులు, ఉద్యోగులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారిని చైతన్యపరుస్తూ పనులను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏటిఏ మల్టీ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా జివి రాంప్రసాద్

**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)**



ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర మల్టీ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా గట్టుపల్లి వెంకట రాంప్రసాద్‌ను నియమిస్తూ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ద్వారా సంఘ బలోపేతం తో పాటు ప్రతి ఉపాధ్యాయునికి శాఖాపరమైన సర్వీసుని తొందరగా అందించడం జరుగుతుందన్నారు. ఈ నియామకం పట్ల ఏటిఏ భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సత్యనారాయణ, మండల ఏ టి ఏ అధ్యక్షులు రేసు వెంకటేశ్వర్లు, సోడి శ్రీదేవి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మర్మం వరలక్ష్మి దేవి, మహిళా జిల్లా కార్యదర్శి తోలం సుజాత,జిల్లా కార్యదర్శి కలం సత్యనారాయణ, కొర్స చిట్టిబాబు, మట్ట వెంకటేశ్వర్లు కారం గాంధీలు అభినందనలు తెలిపారు.

కార్పొరేషన్ పరిధిలో

## ప్రభుత్వ స్థలాలను రక్షించండి..

**29 డివిజన్లో స్మశానం ముందు స్థల ఆక్రమణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలి. .**

**జలాల్ సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ కన్వీనర్ ఆవాజ్ పట్టణ కార్యదర్శి ..**

**భద్రాద్రి కొత్తగూడెం/ జులై 01/ జనం సాక్షి.**



కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు మరియు సింగరేణి భూములు అనేకం ఆక్రమణకు గురవుతున్నాయని. సేవ్ కొత్తగూడెం సేవ్ కార్పొరేషన్ కన్వీనర్ ఆవాజ్ పట్టణ కార్యదర్శి జలాల్ ఆరోపించారు. అధికారులు అనేకసార్లు స్థలాల వద్ద బోర్డులు పెట్టినప్పటికీ కాలా అనుగుణంగా ఆ బోర్డులు పడిపోవడం కావాలని పక్కన జరపడం చేస్తూ అనేక ఆక్రమణకు గురవుతున్నాయని ఆయనే అన్నారు. అక్కడక్కడ అధికారులు ఆక్రమణదారులపై చర్యలు చేపడుతున్నప్పటికీ అవి నామమాత్రం గానే కనబడుతున్నాయని. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురవుతాయి రేపు భవిష్యత్తు అవసరాల కోసం తీవ్ర ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 29వ డివిజన్లో హిందూ స్మశాన వాటిక ముందు ఉన్న స్థలం పై జరుగుతున్న వివాదం అధికారులు సమగ్ర విచారణ జరిపించి దాని పరిస్థితి బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక ప్రభుత్వ స్థలాలకు పేదల పేరుతో కొంతమంది బినామీదారులు దొంగ ఇంటి నెంబర్లు పెడుతూ ముందు ఒకరిని పెట్టి వెనక నుండి రాజకీయం చేస్తూ ఆ స్థలాలను తర్వాత అమ్మకానికి పెడుతున్నారని ఇది నిత్యం కొత్తగూడెంలో అందరికీ తెలిసిన జగమెరిగిన సత్యమేనని ఆయన అన్నారు. కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వ మరియు సింగరేణి స్థలాల రక్షణకై ప్రత్యేక దృష్టి సారించాలని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై నాన్ బేలబుల్ కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## లింగన్న ఆశయాలు సాధనకై పోరాడుదాం

**గుండాల, జూలై 31(జనం సాక్షి);**
లింగన్న చూపిన ఆశయాలు మార్గంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ముక్తిసత్యం కోరం సీతారాములు పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామంలో లింగన్న ఏడో వర్ధంతి సందర్భంగా లింగన్న స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడుతూ భూమి. భుక్తి. పీడిత ప్రజల విముక్తికై నూతన ప్రజాతంత్ర విప్లవ పోరాట బాటలో కామ్రేడ్ లింగన్న ఇల్లందు ఏజెన్సీ ప్రాంతంలో అనేక పోరాటాల నిర్వహించి ముఖ్యంగా గిరిజన గిరిజన ఇతరులకు పోడు భూములు సాధనలో శక్తివంచనకు లేకుండా కృషి చేశారని లింగన్న పోరాట ఫలితంగా ఈ ప్రాంతంలో అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయని అన్నారు లింగన్న చూపిన మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయవంతానికి ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం లాలయ. వ్యాసారపు వెంకన్న. పెండేకట్ల పెంటయ్య. పరిశిక రవి.మానాల ఉపేందర్. వీసం కృష్ణ. తాటి రమేష్. పాయం నాగేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు

## ఇంటికో మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

## సర్పంచ్ రామకృష్ణ



**కొత్తగూడెం క్రైమ్, జూలై31 (జనం సాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో కిన్నెరసాని గ్రామంలో శుక్రవారంపర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటికో మొక్క నాటాలని సర్పంచ్ రామకృష్ణ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యం తగ్గి స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.కిన్నెరసానిలో సర్పంచ్ రామకృష్ణ, సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించడం కూడా తమ బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి కొవ్వొత్తులతో నివాళులు

టేకులపల్లి,జూలై 31(జనంసాక్షి): తెలంగాణ ఉద్యమ నాయకుడు,మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



యశోద హాస్పిటల్ లో గత వారం రోజుల నుండి వైద్య సేవలు పొందుతూ శుక్రవారం రాత్రి సుమారు 12:51 నిమిషాలకు తుది శ్వాస విడవడం యావత్ తెలంగాణ ప్రజలు జీయర్నించు కోలేకపోయారని, టేకులపల్లి మండల సహచర ఉద్యమకారులు, బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులుగ్ర్భ్భాంతికి గురవుతూ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి భారత రాష్ట్ర సమితి మాజీ అధ్యక్షులు తేజావత రవి నాయక్, కుమ్మరి కిరణ్ కుమార్,ఉద్యమ నాయకులు తేజావత్ వస్త్రం నాయక్, టేకులపల్లి సర్పంచి బోడ బాలు నాయక్, ఉపసర్పంచ్ అనంతుల వసంత లక్ష్మి, మహిళా అధ్యక్షురాలు ఆమెడ రేణుక, మాజీ ఎంపీటీసీ జాలాది అప్పారావు, కొట్టే సురేషు మాలప్రోలు రవి, నాగేశ్వరరావు, మురికి మహేష్ బాబు,అమర్ సింగ్ తేజా వత్ పాల్గొన్నారు.

## గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**○రెండవ ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తం**

**○లోతట్టు ప్రాంతాల ప్రజలు వెంటనే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి**

**○ప్రజల సహాయార్థం 24 గంటలు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులో ఉన్నాయి**

**భద్రాద్రి కొత్తగూడెం/ జులై 01/ జనం సాక్షి.**
భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం భద్రాచలం వద్ద గోదావరి వరద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మొదట విస్తా కాంప్లెక్స్ స్లూయిస్ వద్ద వరద నీటి పారుదల పరిస్థితి, మోటార్ల పనితీరును ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీరు వేగంగా బయటకు వెళ్లేలా మోటార్లను నిరంతరం నిర్వహించాలని, ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.
అనంతరం కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్, స్నానఘాట్ల వద్ద పరిస్థితిని సమీక్షించారు. గోదావరిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను అనుమతించరాదని, ప్రమాద ప్రాంతాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
అలాగే కూనవరం?భద్రాచలం ప్రధాన రహదారిపై గోదావరి వరద నీరు ఎక్కడ వరకు చేరిందనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ× , భద్రాచలం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ప్రవాహం వేగంగా పెరుగుతోందన్నారు. శుక్రవారం గోదావరి నీటిమట్టం 48.00 అడుగులకు చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 11,44,645 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోందని, నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు తెలిపారు .లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేలా అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు.వరదల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్, వైద్య, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ఎన్‌డీఆర్ఎఫ్ (ఔఆఖీఈ), ఎస్‌డీఆర్ఎఫ్ (ూఆఖీఈ), డీఆర్ఎఫ్ (ఆఖీఈ) బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు భద్రాచలం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు పనిచేస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఫోన్: 08744-241950, వాట్సాప్: 9392919743 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ , గోదావరి వరద ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి దిగరాదని, సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాద ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను లేదా 100 నంబర్‌కు సమాచారం అందించి పోలీసు సహాయం పొందాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో సమన్వయంతో ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ పరిశీలనలో ఇరిగేషన్ ఎస్సీ మహేశ్వర రావు, దేవస్థానం ఈవో దామోదర్ రావు, భద్రాచలం తాసిల్దార్ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, డిడి ఆర్ఎఫ్ అధికారులు,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం ?



వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు, ప్రజలు ఎవరూ ఆ మార్గంలో ప్రయాణించకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.అనంతరం తూరుబాక?దుమ్ముగూడెం ప్రధాన రహదారిని పరిశీలించిన కలెక్టర్, ఇప్పటికే వరద నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలను నిలిపివేసి మార్గాన్ని మూసివేసినట్లు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బ్యారికేడ్ల వద్ద నిరంతరం పోలీసు బందోబస్తు కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలు వరద నీటిలో ప్రయాణించకుండా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలను వెంటనే అమలు చేయాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.




## ఆర్టీసీ గ్యారేజ్ లో కృష్ణయ్య చేసిన సేవలు మరువలేనివి

### పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన గ్యారేజ్ కార్మికులు

**జనంసాక్షి, మిర్యాలగూడ :**

ఆర్టీసీ లో క్రిష్ణయ్య సేవలు మరువలేనివని డిపో మేనేజర్ రామ్మోహన్ రావు అన్నారు. శుక్రవారం నాడుమిర్యాగూడ లో కృష్ణయ్య పదవి విరమణ సందర్బంగా ఏర్పాటు చేసిన సన్మాన సభ లో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో 36సంవత్సరాలు గా సూర్యాపేట,కోదాడ,దేవరకొండ,మిర్యాలగూడ ఆర్టీసీ డిపో లలో లీడింగ్ మెకానిక్ గా, సూపర్వైజర్ గా రాగోజు కృష్ణయ్య విధులు నిర్వహించి, విధి నిర్వహణ లో అంకితం భావం తో పనిచేసి అందరి మన్ననలు పొందారని అన్నారు.కుటుంబ ఉన్నతికి తల్లి లాంటి ఆర్టీసీ పురోభివృద్ధికి నిరంతరం శ్రమించి ఎందరికో ఆదర్శంగా నిలిచి తోటి ఆర్టీసీ కార్మికులతో కలిసిమెలిసి పనిచేసి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్బంగా సన్మాన మహోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్యారేజ్ ఇంచార్జ్ యాదగిరి మాట్లాడుతూ ఏనాడు ఎలాంటి తప్పిదం లేకుండా అందర్నీ కలుపుకొంటూ తన పని తాను చేసుకుంటూ సహచర ఉద్యోగులతో కలిసిమెలిసి పనిచేసేవాడన్నారు.కృష్ణయ్య మృదుస్వభావి అని, తాను ఎక్కడ ఉన్నా ఆర్టీసీ కార్మికులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కృష్ణయ్య మాట్లాడతూ ఆర్టీసీ చెట్టు లాంటిదని చెట్టు ఏ విధంగా నీడనిస్తుందో కార్మికులకు డిపో చెట్టు లాంటిదని వారన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికులతో కలిసి కృష్ణయ్య అనిత దంపతులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి హృదయపూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**బూర్గంపహాడ్ జూలై 31 (జనంసాక్షి)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాకలో ఉన్న తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల ఇంటర్ కళా శాలలో 2026?27 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె జ్యోతి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ (సీఈసీ), హెచ్ఈసీ (హెచ్ ఇ సి) గ్రూపుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ విద్యార్థినుల కోసం 10 సీట్లు, బీసీ విద్యార్థినుల కోసం ఒక సీటు అందుబాటులో ఉందన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సివిల్ సర్వీసులు, గ్రూప్స్, సీఏ, లాసెట్, డీఈఈసెట్ (డిఐఈటి సెట్) వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక ఉచిత శిక్షణతో పాటు విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు 7331125355 నంబర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ జె జ్యోతి సూచించారు.

## ఆళ్లపల్లి మండలం నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

### అధ్యక్షులు ఊకె కిషోర్ బాబు - ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవికుమార్ ఉపాధ్యక్షులు కొమరం వెంకటకృష్ణ - కోశాధికారి కాసబోయిన వెంకటేశ్వర్లు



**ఆళ్లపల్లి జూలై 31(జనం సాక్షి)** మండల పరిధిలో నూతననంగ ప్రెస్ క్లబ్ ఎన్నిక అధ్యక్షులుగా ఊకే కిషోర్ బాబు(సాక్ష్యం) ఉపాధ్యక్షులుగా కొమరం వెంకటకృష్ణ(నవ భూమి) ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి రవికుమార్ (జనం సాక్షి ) కోశాధికారిగా. కాసబోయినవెంకటేశ్వర్లు(వార్త) కమిటీ సభ్యులుగా యాసారపు సాగర్( తెలంగాణ పత్రిక),కొమరం సతీష్ (మెట్రో ఈవినింగ్ ),కోరుకొప్పుల సాగర్(మన భద్రాద్రి),చామకూరి అన్వేష్ (ఈ మాట),ఊకే బద్రు ( నినాదం),పాయం పురుషోత్తం (ప్రజా దర్బార్),నూతనంగా ఎన్నుకోవడం జరిగింది.నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఊకే కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో పారదర్శకత పాలకులలో జవాబుదారితనం ప్రతి అక్షరాన్ని ప్రజల కోసం ప్రజల గొంతుకగ మారుస్తూ నిత్యం నిజాయితీగల వార్తలు కథనాలతో పత్రికల పాత్రికేయులు అందరూ ఒకటిగా గర్జించే ఒక కొత్త సామాజిక తొలి అడుగని తెలిపారు.

## ఓసి 2 డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణికి అప్పగించాలి - ఏఐటీయూసీ, సిపిఐ




- సిపిఐ ఆధ్వర్యంలో మణుగూరులో భారీ ఆందోళన, రాస్తారోకో..
- స్తంభించిన ట్రాఫిక్ బిబిపోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ

**మణుగూరు, జూలై 31 (జనంసాక్షి):** ఓసి 2 డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కి కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శుక్రవారం మణుగూరు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సిపిఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. పార్టీ నాయకులు పెద్ద ఎత్తున జెండాలు చేత పట్టుకొని “ సేవ్ మణుగూరు అంటూ సిపిఐ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఓసి టు డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించాలి” అనే నినాదం తో పెద్ద ఎత్తున ప్రధాన రహదారి మీద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఓసి టు డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కాకుం డా జెన్కోకు అప్ప చెప్పాలని ప్రభుత్వం చూస్తుందని, దీనివలన సింగరేణి కార్మికులు పూర్తిస్థాయిలో నష్టపోయే ప్రమాదం ఉందని, సింగరేణి కేటాయిస్తే సింగరేణి ద్వారా జెన్కో కి బొగ్గు సప్లై చేసుకోవచ్చని. దీనివలన కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందని ఈ ప్రాంతంలో డిప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయిస్తే సింగరేణి 10 సంవత్సరాల మనుగడ కొనసాగుతుందని, దీని వలన ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ ప్రాంతంలో ఉన్న సింగరేణి కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు ,లారీ ఓనర్స్ ,లారీ డ్రైవర్స్, గుమస్తాలు ,బొగ్గు ముఠా కార్మికులు ,ఇలా ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు పదివేల కుటుంబాలు దీని మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నా యని ,51 శాతం రాష్ట్రంలో వాటా , కేం ద్రంలో 49 శాతం వాటా ఉన్న సింగరేణి బ్లాక్ లను ఎందుకు దీనిని ప్రైవేటు అప్పజెప్పాలని ప్రయత్నం చేస్తున్నారని, కేవలం కమిషన్లకు కక్కుర్తి పడి ఇవాళ సింగరేణి బ్లాకులను ప్రైవేటుపరం చే యాలని చూస్తున్నారని వారు ఆరోపిం చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శులు కొరిమి రాజకుమార్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్యసింగరేణి కాలనీ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రామ్ గోపాల్ , సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు ,జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామ నరసయ్య, మేకల ఈశ్వర్, అదెర్ల సురేందర్, ఇమాముద్దీన్, శనిగరపూ కుమారస్వామి, ఆవుల నాగ రాజు, సాయి, కిషోర్ బాబు, యాకూబ్ శివయ్య, సందీప్, కందిమల్ల రామయ్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శిలు తోట రమేష్, చింతల దశం ్థం, మండల సహాయ కార్యదర్శి వేర్పు ల నరేష్, ఎస్ కే సర్వర్, ఎస్ డి ఓమర్, సర్పంచ్ చీదం ఉషారాణి ,ఉపసర్పంచ్ పులిగల రమేష్, బోలగాని సమ్మక్క, తేనేటి నారాయణ, కొత్తపల్లి సీతారాము లు వార్డు మెంబర్ వజ్రా వెంకటేశ్వర్లు ఆధార్ల రాములు, మంద కోటి, యాకూ బ్ శ్రీకాకుళం వీరమల్లు కన్నెబోయిన ప్రసాద్ అడబాల ప్రవీణ్ సంపత్, యాకయ్య, పార్టీ మరియు యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొత్తగూడెం లో శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు అంబరాన్నంటాయి

### జాతరలో భాగంగా అమ్మవారికి నిర్వహించిన విశేష రథోత్సవం కనులపండువగా సాగింది భక్తజన సందోహం మధ్య అమ్మవారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు..

**కొత్తగూడెం జనంసాక్షి** :కొత్తగూడెం పట్టణంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల జాతర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా బలిహరణ, సంప్రోక్షణ వంటి కార్యక్రమాలను ముగించుకున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి కర్పూర హారతులు సమర్పించి, భక్తిశ్రద్ధలతో రథయాత్రను ప్రారంభించారు.ఈ రథోత్సవంలో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పు వాయిద్యాల చప్పుళ్లు, కళాకారుల కోలాట నృత్యాలు, సాంప్రదాయ నృత్యాలతో కొత్తగూడెం పురవీధులు మారుమోగాయి. ముఖ్యంగా అమ్మవారి వేషధారణలో భక్తులను ఆశీర్వదిస్తూ సాగిన కళాకారుల రూపాలు భక్తులను ఎంతగానో అలరించాయి. మహంకాళి అమ్మవారు అలంకృత రథంపై అధిష్టించి కొత్తగూడెం పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా సాగుతుంటే, భక్తులు నీరాజనాలు పలికారు. ఇరువైపులా నిలబడి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పట్టణమంతా ఆధ్యాత్మిక శోభతో విరాసిల్లింది. పురవీధుల గుండా వైభవంగా సాగిన ఈ రథయాత్ర అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంది. రథయాత్ర ముగిసిన తర్వాత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# ఈ నెల 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలి

## విబిజి రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



**సూర్యాపేట(జనంసాక్షి):** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైల్ భరోను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన ఆ సంఘ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.స్వేచ్ఛ వాణిజ్య వ్యాపారం వల్ల మన దేశ రైతాంగానికి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించదని అన్నారు.అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి విబిజి రాంజీ పేరుతో కొత్త బిల్లు తీసుకువచ్చిందని, ఈ బిల్లు వ్యవసాయ కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు విడుదల చేయాలన్నారు.కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు కోడ్ లుగా విభజిస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పీఎం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.రాష్ట్రంలో భూమిలేని పేద వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న ఏడాదికి 12 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు,రాష్ట్ర కమిటీ సభ్యులు పులుసు సత్యం, పోసనబోయిన హుస్సేన్, జంపాల స్వరాజ్యం, సిరికొండ శ్రీను, సోమపంగు జానయ్య, కడెం కుమార్, గుంజ వెంకటేశ్వర్లు, దేవరకొండ యాదగిరి, జాజిగల్ల ముత్తయ్య, బుడిగే ధనుంజయ్ గౌడ్, కొల్లూరి బాబు, ఉయ్యాల పారిజాత, ఇరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి..

## అశ్వాపురం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు



**అశ్వాపురం జూలై 31 (జనంసాక్షి):** భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 48 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు సూచించారు. వాగులు, వంకలు, కాలువలు దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని, వరద నీటి సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు.గోదావరి వరదల కారణంగా విషపూరితమైన పాములు, తేళ్లు, ఇతర కీటకాలు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరద ప్రభావిత పంపు గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.ప్రజలంతా అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మేరకు మాత్రమే స్పందించాలని, ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు.

# ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు



**ఎర్రుపాలెం, జూలై 31 (జనంసాక్షి):** ఓటర్ నమోదు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు 24 గంటల ఎస్ ఐ ఆర్ మండల ప్రభాస్ అభియాన్ లో భాగంగా ఖమ్మం జిల్లా అధ్యక్షులు మండల ప్రవాసిగా ఎర్రుపాలెం మండలం రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ పై మండల అధ్యక్షులు అనుమోలు సురేష్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించి మండలంలోని బూత్ లు సందర్శించి బిఎల్ఓ లను కలిసి ఎస్ ఐ ఆర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ ప్రోగ్రాం లో ఎక్కువ శాతం ఓటరు నమోదు లను అభినందించారు.ఈ సందర్భంగా మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన జమలాపురం వెంకటేశ్వర స్వామి నిర్వహించు కున్నారు. అదేవిధంగా జమలాపురంలోని బెల్ట్ షాపులు నిర్వహిస్తూ దేవాలయ ప్రవిత్రతను అపవిత్రం చేస్తున్నారని తెలియజేశారు. దేవాలయ అధికారులు ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి ఉపయోగం లేదని తెలియజేశారు.తక్షణమే అధికారులు స్పందించి బెల్టు షాపులపై చర్యలు తీసుకొని దేవాలయ పవిత్రతను భక్తుల మనోభావాలను కాపాడాలని బిజెపి జిల్లా పార్టీ తరపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ ఖమ్మం జిల్లా కన్వీనర్ శ్యాం రాథోడ్, ఎర్రుపాలెం మండల ఎస్ ఐ ఆర్ చావా కిరణ్ మండల బిజెపి రాష్ట్ర నాయకులు, నూతక్కి.నరసింహారావు, మాజీ మండల అధ్యక్షులు కొమ్మినేని.కృష్ణారావు, జిల్లా ఎస్సీ మర్చ నాయకులు దేవరకొండ కోటేశ్వరావు, మండల ఉపాధ్యక్షులు కలసాని.రాంబాబు మండల కార్యదర్శి ప్రేమ్ కుమార్ బూత్ అధ్యక్షులు కన్నా రామకృష్ణ మండల నాయకులు పాల్గొన్నారు.



# చండూరులో హాకా రైతు కేంద్రం ప్రారంభం

**చండూరు, జూలై 31 (జనంసాక్షి)** చండూరు పట్టణంలో హాకా రైతు కేంద్రాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు ఒకేచోట అందుబాటులో ఉండేలా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ అన్నారు. చండూరు పరిసర రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఏఐటియుసి జిల్లా మహాసభను విజయవంతం చేయాలి




**సూర్యాపేట (జనంసాక్షి):** నేడు సూర్యాపేటలో జరిగే ఏఐటియుసి సూర్యాపేట జిల్లా మూడో మహాసభల ఏర్పాట్లను ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా మహాసభలకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజారాం, సూర్యాపేట ప్రాంతీయ కార్యదర్శి సాయి బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు బూర సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ ఏరియాలో డ్రైనేజీ పనుల పరిశీలన - ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం జూలై 31 (జనంసాక్షి)** భద్రాచలం ఇండస్ట్రియల్ ఏరియాలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, డ్రైనేజీ వ్యవస్థను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వర్షాకాలంలో నీటిమునిగే సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల అమలులో నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వార్డు సభ్యులు తాటి ఉదయ్, ఇలమల అశోక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



# విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పొందాలి

## - సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య - జెడ్పీహెచ్ఎస్ కొమ్మాయిగూడెం లో అవగాహన సదస్సు

**రామన్నపేట, జూలై 31 (జనంసాక్షి):** విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పొంది ఉండాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య అన్నారు. మండల పరిధిలోని కొమ్మాయిగూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సుక్క శ్రావణ్ కుమార్, ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు బాల కార్మిక చట్టాలు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, ప్రాథమిక విధులు, బాలల రక్షణ, బాలల హక్కులు, సేఫ్ టచ్ ? అన్‌సేఫ్ టచ్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణ, విద్య ప్రాధాన్యత మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ప్రతి విద్యార్థి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుడు కానుగంటి శ్రీశైలం, ప్రధానోపాధ్యాయులు, పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సఫియా బేగం, అధ్యాపక బృందం, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రైతు రాజ్యం అంటే ఇదేనా?: రెండు దశాబ్దాలుగా తిప్పారెడ్డిగూడెం రైతుల పొలాల బాటల కష్టాలు!

వర్ణనాతీతంగా మారుతోంది. పడిన ప్రతి వానకూ దారంతా మోకాళ్ళ లోతు బురద, నీటితో నిండిపోవడంతో పొలాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. పొలాల్లో పనిచేసే సమయంలో ఎవరికైనా ప్రమాదవశాత్తు పాము కుట్టినా, లేదా గుండెజబ్బు వంటి అత్యవసర ఆరోగ్య సమస్యలు తలెత్తినా కనీసం ఒక ఆటో లేదా అత్యవసర వాహనం (108) కూడా లోపలికి వచ్చే అవకాశం లేకపోవడం ఇక్కడి భయానక పరిస్థితికి అద్దం పడుతోంది.

**ఇకనైనా స్పందించండి**

పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేవలం హామీలే తప్ప క్షేత్రస్థాయిలో అడుగు ముందుకు పడలేదని తిప్పారెడ్డిగూడెం రైతాంగం కన్నీరుమున్నీరవుతోంది. జిల్లా ఉన్నతాధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి, తమ వ్యవసాయ భూములకు శాశ్వత రహదారిని నిర్మించి, రెండు దశాబ్దాల తమ కష్టాల నుంచి విముక్తి ప్రసాదించాలని ఇక్కడి రైతులు చేతులు జోడించి వేడుకుంటున్నారు.





## నిరుపేదకు ఆర్థిక సాయం అందజేసిన కమ్మ సంఘం నాయకులు

**హాలియా, జనం సాక్షి జులై 31:** ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అనుమల మండలం ఆలీ నగర్ కు చెందిన రావిళ్ళ శ్రీదేవి నిరుపేద కుటుంబానికి అనుమల మండల కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 87,500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి అధ్యక్షులు రావిళ్ళ చెన్నయ్య మాట్లాడుతూ శ్రీదేవి కుటుంబం వైద్య ఖర్చులు నిమిత్తం ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి సభ్యుల సహకారంతో సేకరించిన మొత్తాన్ని అందజేశామని, నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం కూడా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పేలపూడి బాలకృష్ణ, విరిగినేని బబ్బి, నారాయణరావు ,జంపాల అనంతయ్య, శివకోటి వీర్రాజు, చౌదరి శీను, కోటపాటి మధుబాబు, రిమ్మలపూడి రామకృష్ణ, జంపాల దుర్గారావు, బిక్కిని వెంకట్రావు, నర్సింగ్ వెంగళరావు, చెరుకూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## విబిజి రాంజి సిబ్బంది పెన్‌డౌన్, షట్ డౌన్ ఐదో రోజుకు చేరిన నిరసన

**పెన్ పహాడ్, జూలై 31 (జనం సాక్షి) :** విబిజి రాంజి సిబ్బంది పే స్కేల్ అమలు, పెండింగ్ వేతనాల తక్షణ విడుదల, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ అమలు తదితర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో చేపడుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్యమంలో భాగంగా శుక్రవారం ఐదో రోజు పెన్‌డౌన్ ? షట్‌డౌన్ చేసి సహాయ నిరాకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, టీఏలు ఏకస్వామి, అనూష, వెంకటేశ్వర్లు, బుచ్చన్న, రామ్‌కుమార్, సీఓలు సరోజ, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**సూర్యాపేట(జనంసాక్షి):** సూర్యాపేట పట్టణానికి చెందిన పేద ఆర్యవైశ్యులకు సూర్యాపేట పట్టణ యువజన విభాగం అధ్యక్షులు మాడుగుల నవీన్ కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్ లో



అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న మిట్ట లక్ష్మీతోపాటు చదువులో రాణిస్తూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కందిబండ అనిల్ కుమార్, బుస్సా జ్ఞానసాయి, బుద్ద శరత్ కుమార్ ,కొందూరు రవి లకు విద్య, వైద్యం నిమిత్తం 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆర్యవైశ్యులకు ప్రోత్సాహం అందించుటకు సూర్యాపేట పట్టణ యువజన సంఘం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు ఉప్పల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ ప్రవీణ్, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శి బోనాల నాగరాజు, కోశాధికారి బచ్చు జగన్, ఉపాధ్యక్షులు పాలవరపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు ఉప్పల రాజశేఖర్ , ఉప్పల రాజేష్, సోమశేఖర్, మొరిశెట్టి నాగరాజు, వంగవీటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ పారిశుధ్యం మెరుగు

## దోమల నివారణకు నాలుగు రోజులుగా అన్ని వార్డుల్లో మందు పిచికారి..

**చండూరు, జూలై 31 (జనంసాక్షి)** చండూరు మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, కమిషనర్ మల్లేశం ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పట్టణంలోని అన్ని వార్డుల్లో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడంతో పాటు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు. దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్

## ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్

**కొండమల్లేపల్లి, జులై 31 (జనంసాక్షి):** ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పిఆర్సి, డీఏలు వెంటనే ప్రకటించాలని సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని నేడు ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా మూకుమ్మడిగా సెలవు పెట్టి విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రభుత్వం పదేపదే ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని నేటి ధర్నాతోనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరుస్తుందని ఆశిస్తున్నామని వారు తెలిపారు. వారివెంట తపస్ కొండమల్లేపల్లి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొమిరి సైదులు, బొమ్మ రవి, జిల్లా కార్యదర్శి బద్దెల అంజయ్య, శ్రీకాంత్ రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.